క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం

ఆత్మకూర్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. శనివారం ఆరేపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో 470 మార్కులకు గాను కుర్వ అరవింద్ 457, వడ్డె శివకృష్ణ 451, అఖిల్‌కుమార్ 446 మార్కులను సాధించి గ్రామానికి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేష్, మాజీసర్పంచ్ ఆంజనేయులు, నాయకులు వెంకటన్న, బాలయ్య, బాలరాజు, దేవేందర్, తిరుపతయ్య, నరేందర్, సత్తి,రమేష్, బాలస్వామి ఉన్నారు.

మే డే వాల్‌పోస్టర్ల విడుదల



అమరచింత: పని గంటల పెంపుదలతో పాటు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తిప్పికొట్టేందుకు కార్మికులందరూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు, మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న కోరారు. టీయూసీఐ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం మే డే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవుల్లో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగితా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవనభద్రత లేదని వాపోయారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఆమోదించి, అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 139వ మే డే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామేలు, భక్తరాజు, కురుమన్న, ఏసన్న, ఆనంద్ పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్: శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో సాధించిన ఘనతలు మరువలేనివని, గణితం ఉన్నంత వరకు రామానుజన్ గుర్తుంటారని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాంప్రకాశ్ అన్నారు. రామానుజన్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, బాలేమియా, కృష్ణయ్య, దర్శన్‌కుమార్, బాలస్వామి, నాగరాజు, వెంకటేష్, నరసింహ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం కుట్రను తిప్పికొడదాం'



వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వం పేద కూలీలకు ఉపయోగకరంగా ఉండే జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని, దీన్ని తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ మహబూబ్ పాష అన్నారు. శనివారం గోవర్ధనగిరి గ్రామంలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో వారు మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు రూ.కోట్లు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కనీస అవసరాలకు ఉపయోపడే విధంగా కూలి రేట్లను పెంచడం లేదని వారు విమర్శించారు. వ్యవసాయ, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాలు నారాయణపేట జిల్లాలోని మరికల్ పట్టణంలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు ఉపాధి కూలీలకు విజ్ఞప్తి చేశారు.

భర్తపై కేసు నమోదు

పాన్‌గల్: భార్యను వేధించిన ఘటనలో శనివారం భర్తపై కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాయిపల్లికి చెందిన పస్పుల బాలమణికి ఇదే గ్రామానికి చెందిన అబ్దుల్లాతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా భార్య బాలమణిని అబ్దుల్లా అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ విషయంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పారు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈనెల 24న గ్రామ శివారులో వ్యవసాయ పొలంలో అబ్దుల్లా భార్యను కట్టెలతో కొట్టడంతో శరీరమంతా రక్త గాయాలయ్యాయి. దీంతో ఆగకుండా చంపుతానని బెదిరించాడు. ఈ విషయంపై తల్లి నర్సమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దళారులను ఆశ్రయించొద్దు

- పీఏసీఎస్ సీఈఓ రాఘవేందర్‌రెడ్డి
- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర



నాగరాలలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పామాపురం పీఏసీఎస్ సీఈఓ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని అప్పరాల, రామకృష్ణాపురం, నాటవెల్లి గ్రామాల్లో పీఏసీఎస్ పామాపురం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించి ధరకు రైతులు వరిధాన్యం విక్రయించాలని, ధాన్యం కొనుగోలు చేసిన 48గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే సన్న రకాలకు రూ.500బోనస్ సైతం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, రావుల కర్ణాకర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, శివరాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షులు దేశి వెంకటయ్య, రైతులు శంకర్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, మోహన్‌గౌడ్, రాములుగౌడ్, శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, మొగులన్న, టి.రాములు, గట్టు, చంద్రుడు, రైతులు తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి నిర్వాహకులకు సూచించారు. శనివారం మండలంలోని మల్లాయిపల్లి, చింతకుంట, మాందాపూర్, కొత్తపేట గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాలల్లో రైతులకు నీడ, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్, గోప్లాపూర్ కొనుగోలు కేంద్రాలను డీటీ అశోక్‌కుమార్, దావాజిపల్లి, దొండాయిపల్లి, అన్నారం, బండపల్లి కొనుగోలు కేంద్రాలను ఆర్ఐ మహేష్‌నాయుడు పరిశీలించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల రెండో సెంటర్‌లో సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పెబ్బేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీహరి రాజు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..

వీపనగండ్ల: పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు దళారులను ఆశ్రయించొద్దని ఏపీఎం బుచ్చన్న రైతులకు విజ్ఞప్తి చేశారు. శనివారం కొర్లకుంటలో మండల మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంతమ్మ, గ్రామ సంఘం అధ్యక్షురాలు మంగమ్మ, బుక్‌కీపర్ శృతి, రైతులు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం మాందాపూర్‌లో..



రామకృష్ణాపురంలో..



కొర్లకుంటలో..

వరంగల్ సభకు భారీగా తరలిరావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వరంగల్ రజతోత్సవ సభకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా కార్యకర్తలు భారీగా తరలేందుకు సిద్ధంగా ఉన్నారని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డితో కలిసి వారి స్వగృహంలో బీరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు తరలివెళ్లే ముందు నాయకులు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా వాహనాలల్లో వెళ్లే వారు తాగునీరు, అవసరమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని నాయకులకు, కార్యకర్తలను కోరారు. మండలం నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా సభకు వెళ్లాలన్నారు. సమావేశంలో మండల పార్టీ నాయకులు వెంకటయ్యనాయుడు, రాంచందర్‌యాదవ్, మధుసూదన్‌గౌడు, నాగరాజు, రమేష్‌నాయక్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే అంబేడ్కర్‌కు నిజమైన గౌరవం



వనపర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ మీద ఏనాడు అభిమానం చూపలేదని, దేశ తొలి న్యాయశాఖ మంత్రిగా అంబేడ్కర్ మొదలుపెట్టిన హిందూ కోడ్ బిల్లును నెహ్రూ అడ్డుకోవడంతోనే ఆనాడు అంబేడ్కర్ రాజీనామా చేశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు అశోక్ అన్నారు. అంబేడ్కర్ జయంతి నుంచి 15 రోజుల పక్షోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా అధ్యక్షుడు నారాయణ అధ్యక్షతన జిల్లాకేంద్రంలో నిర్వహించిన సెమినార్‌లో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో అంబేడ్కర్‌కు గౌరవం దక్కలేదని, మోదీ హయాంలోనే నిజమైన గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, హేమారెడ్డి, రామన్‌గౌడ్, సుమిత్రమ్మ, సీతారాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయాలి



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వనపర్తి టౌన్: ప్రతిఫలం ఆశించకుండా పేదలకు అందించే సేవతోనే సంతృప్తి కలుగుతుందని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం వనపర్తి చింతల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ దీక్షాపరులకు, భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. చింతల హనుమాన్ ఆలయం మహిమాన్విత క్షేత్రమని, ఈ క్షేత్రం వ్యాసరాయులు ప్రతిష్ఠించినట్లు ప్రాచుర్యంలో ఉందన్నారు. ఎక్కడా లేని విధంగా శంకుచక్రాలతో ఆంజనేయస్వామి విష్ణుమూర్తి రూపంలో కొలువుదీరారని కొనియాడారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు ఎండ తీవ్రతను లెక్క చేయకుండా పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతున్నారన్నారు. అంతకు ముందు వనపర్తి చింతల హనుమాన్ ఆలయంలో 40 ఏళ్ల శ్రీనివాస్‌గౌడ్ రాజకీయ ప్రస్థానంపై వీడియో రూపంలో రూపొందించిన డాక్యుమెంటరీని డీసీసీ మాజీ అధ్యక్షుడు, టెలికం బోర్డు సభ్యుడు శంకర్‌ప్రసాద్, ప్రముఖ వ్యాపారవేత్త ఎస్ఎల్ఎన్ రమేష్, నాయకులు లక్ష్మీనారాయణ, బ్రహ్మం, రామిరెడ్డి, హనుమాన్, దీక్షాపరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధుగౌడ్, కృష్ణయ్యగౌడ్, రామన్‌గౌడ్, చంద్రపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

గోపాల్‌పేట: తప్పిపోయాడు అనుకున్న వ్యక్తి మృతదేహంగా లభ్యమైన ఘటన చాకల్‌పల్లిలో చోటు చేసుకుంది. గోపాల్‌పేట ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చాకల్‌పల్లికి చెందిన ధర్మారెడ్డి (60) 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు ఆయన గ్రామంలోని రచ్చకట్ట వద్దకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి, తిరిగి ఇంటికి రాలేదు. రెండు రోజులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో శనివారం ఉదయం ఆయన కుమారుడు లోకేశ్వర్‌రెడ్డి వారి పొలానికి వెళ్లగా బావిలో మృతదేహం ఉన్నట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి ధర్మారెడ్డి అని గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ పేర్కొన్నారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



సమీకృత కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధులు

వనపర్తి విద్యావిభాగం: పాతకోటలోని సమీకృత కూరగాయల మార్కెట్, పాత వ్యవసాయ మార్కెట్‌లోని సమీకృత మార్కెట్లను వెంటనే వినియోగంలోకి తేవాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధుల బృందం ఆయా మార్కెట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోట్లు పెట్టి బిల్డింగులు కట్టి.. నిరుపయోగంగా వదిలేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ కాసుల కోసం మళ్లీ కొత్త భవనాలు కడతామంటున్నారని ఎద్దేవా చేశారు. పాతకోటలోని కందకంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 14వ ఫైనాన్స్ నిధులతో కట్టిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా ఉందని, దాన్ని వినియోగం లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారన్నారు. లేకపోతే డబుల్‌బెడ్ ఇళ్లు కట్టి ప్రజలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, సీపీఎం నాయకులు మార్టిన్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, కష్టయ్య, శ్రీనివాసులు, సురేష్, రాముడు, బాషా తదితరులు ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్ఓ రామయ్య అన్నారు. శనివారం మండలంలోని గోప్లాపూర్ సబ్‌సెంటర్‌ను ఆయన సందర్శించి, వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు వేయించుకోవడంతో అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని, పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుందో తెలుసుకోవడానికి ఎంసీహెచ్ వ్యాక్సినేషన్ పుస్తకం చదవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరి, ఆశాకార్యకర్తలు లక్ష్మి, సావిత్రమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'మిస్ వరల్డ్ పోటీలు రద్దు చేయాలి'



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యులు

వనపర్తి రూరల్: హైదరాబాద్‌లో మే 7న నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఐద్వా (ఐడబ్ల్యూఏ - భారత మహిళా సమాఖ్య) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ వంటి పోటీలు మహిళలను కేవలం శరీర సౌందర్యపు ప్రదర్శన వస్తువులుగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని, మానవ హక్కులను అవమానించే ఈ పోటీలు స్వతంత్ర భారతదేశంలో జరగడం దురదృష్టకరం అని తీవ్రంగా ఖండించారు. పురుషాధిపత్య సంస్కృతిని నిలబెట్టే ఈ రకమైనా కార్యక్రమాలను నేటి సమాజం పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. మహిళల ప్రతిభ, సామర్థ్యాన్ని పదర్శించే వేదికలు ఏర్పాటు చేయాలి కానీ కేవలం వారి శరీరాన్ని ప్రదర్శించే పోటీలకు ప్రోత్సాహం ఇవ్వడం లైంగిక వివక్షగానే పరిగణించాలన్నారు. కార్యక్రమంలో కవిత, ఉమ, రేణుక, సుగుణమ్మ, శ్యామల, శివమ్మ, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

'మతం ముసుగులో దాడులు సరికాదు'



కొత్తకోటలో..



కంభాళాపురంలోలో అమరులకు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

అమరచింత: కశ్మీర్‌లో పర్యాటకులపై దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను ఉరి తీసి ఉగ్రవాదాన్ని అంతమొందించాలని ముస్లిం యూత్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన పర్యాటకులకు సంఘీభావంగా నల్లబ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తుల తో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడులతో దేశ సమైక్యతను దెబ్బతీయలేరని స్పష్టంచేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అది ప్రపంచ మానవళికి నష్టం కలుగుతుందని, అందరూ కలిసి వ్యతిరేకించాలని కోరారు. మతం ముసుగులో భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశంలో ఇలాంటి దాడులకు పాల్పడితే పౌరులు చూస్తూ ఊరుకోరన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, తౌఫిక్, పాషా, అశ్వక్, ఖాసీం, ఇమ్రాన్, సమీర్, కరీం పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన అమరులకు పట్టణ కేంద్రంలో బైక్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోమొబైల్, షోరూం షాపుల యజమానులు, కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, దూపం నాగరాజు, అధ్యక్షుడు రఫిక్‌ఖాన్, మేఘారెడ్డి, మన్యం, చందు, మోహన్‌గౌడ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: జమ్ముకశ్మీర్ పహల్గామ్ వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు సంఘీభావంగా శనివారం రాత్రి శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన



పాన్‌గల్‌లో బడిఈడు పిల్లల తల్లిదండ్రులతో హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: ప్రభుత్వ బడిలో చేర్పించాలని నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారంలో తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తుందని పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పద్మ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం పాన్‌గల్‌లో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల పూర్వ విద్యార్థులే ప్రచారంలో పాల్గొంటూ ప్రభుత్వ బడుల్లో అందుతున్న విద్య గురించి వివరించారు. విద్యార్థుల సామర్థ్యాలు, అందమైన వర్ణచిత్రాలు, వివిధ విద్యా సంబంధ అంశాలతో కూడిన పాఠశాల భవన సముదాయం కూడా తల్లిదండ్రులను ఆకర్శించినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తమ పిల్లలను తప్పక ప్రభుత్వ బడికే పంపిస్తామని భరోసా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వెంకట్‌నారాయణ, వెంకటేష్‌యాదవ్, ప్రేమ్‌సాగర్, సీఆర్పీ గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి


ఆత్మకూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు ఆత్మకూర్ నుంచి తరలివెళ్లారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, నాయకులు, కార్మికులు ఉన్నారు.

అమరచింత: నారాయణపేట జిల్లా మరికల్‌లో శనివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు అమరచింత మండలం నుంచి సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు శనివారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, శంకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, సహాయ కార్యదర్శి ఆర్ఎస్ రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి వెంకటేష్, సత్యం, బుచ్చన్న, విజయ్, అరుణ్, మోహన్, రవి, రాఘవేంద్ర, చంటి పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రంలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఏఈ ఓపీ రాజయ్యగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాలయం దగ్గర కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు లైన్ లాగడం, భగీరథ స్విమ్మింగ్‌పూల్ మెయిన్ రోడ్డు, వెంగళరావునగర్ కాలనీలో కరెంటు వైర్లకు తగులుతున్న కొమ్మలను తొలగింపు, 11 కేవీ కేడీఆర్ లైనులో ఏబీ స్విచ్‌లు అమర్చేందుకు, లో, హై ఓల్టేజీ ఉన్న ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించడానికి కొత్త 11 కేవీ లైన్‌లలో ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆర్టీసీకాలనీ, వెంగళరావునగర్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్, టీచర్స్‌కాలనీ, చందాపూర్ రోడ్, ఐజయ్య నగర్‌కాలనీ, సాయినగర్‌కాలనీ, సాగర్ కాలనీ, జంగిడిపురం, న్యూటౌన్‌కాలనీ, కేడీఆర్ నగర్, వల్లభ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు



ఖిల్లాఘనపురం వెనకితండాలో లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి



కిష్టగిరిలో..



మిట్టనందిమళ్లలో..

అమరచింత: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు నిబంధనల మేరకు నిర్మించుకుంటేనే బిల్లులు మంజూరవుతాయని ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, మస్తీపురం, అమరచింత పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలపై అవగాహన కల్పించారు. సొంతంగా ఇంటి స్థలం ఉండి, పునాది వరకు నిర్మిస్తే రూ.లక్ష మంజూరు అవుతాయన్నారు.

వనపర్తి రూరల్: ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల వివరాలను శనివారం ఎంపీడీఓ రాఘవ, ఇందిరమ్మ కమిటీలతో కలిసి మండలంలోని కిష్టగిరిలో పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకున్న వారికే బిల్లులు మంజురవుతాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి తులసి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారమే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజు తెలిపారు. శనివారం ఆయన మండలంలోని అప్పారెడ్డిపల్లి, వెనికితండాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు యాప్‌లో నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్ రాజునాయక్, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా..

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ చాంద్‌పాషా అన్నారు. శనివారం మండలంలోని మూలమళ్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే నిర్వహించారు.